సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 26 । మార్చి । 2023



చిరుధాన్యాలకు ప్రాధాన్యం

చిరుధాన్యాలు, ఆహార ఉత్పత్తుల ప్రదర్శన ఆకట్టుకుంది. వైఎస్సార్ ఆసరా కార్యక్రమం లో భాగంగా ఏర్పాటు చేశారు. - 8లో



చిన్నారిని ఆదుకోరూ..

ఐదేళ్ల చిన్నారి క్యాన్సర్‌తో బాధ పడుతున్నాడు. చికిత్స కోసం ఆ కుటుంబం ఆర్థిక సాయం కోరుతోంది. - 8లో

మూడో తేదీ నుంచి పింఛన్ల పంపిణీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఏప్రిల్ 3వ తేదీ నుంచి పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ ఒకటి సెలవు దినం, రెండో తేదీ ఆదివారం కావడంతో ఏప్రిల్ పింఛన్లు మూడో తేదీ నుంచి పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించాలని కోరారు.



రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

కారుణ్య నియామకాలకు ఇంటర్వ్యూలు



ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ శాఖల్లో కారుణ్య నియామకాల కోసం శనివారం కలెక్టరేట్‌లో ఇంటర్వ్యూలు, ధ్రువీకరణ పత్రాల పరిశీలన నిర్వహించారు. డీఆర్‌ఓ ఎం.రాజేశ్వరి 27 మంది అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి సర్టిఫికెట్లు పరిశీలించారు. వీరికి ఖాళీగా ఉన్న సచివాలయాలు, ఆర్టీసీ శాఖల్లో ఉద్యోగాలు ఇవ్వనున్నారు. సచివాలయాల్లో సెక్రటరీ, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీసులుగా అవకాశం కల్పించనున్నారు. ఆర్టీసీలో (ప్రజా రవాణా సంస్థ)లో డ్రైవర్, కండక్టర్, గ్యారేజీలో పోస్టులు వీరికి కేటాయిస్తారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రాజేశ్వరరావు, డీటీ సాదు శంకరరావు, ఢిల్లీతో పాటు ఆర్టీసీ అధికారులు నాయుడు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు ఉన్నారు.

దరఖాస్తులకు గడువు పెంపు

శ్రీకాకుళం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాలు 2023–24కు గాను 5వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి గాను ఈనెల 31 వరకూ గడువును పెంచినట్లు శ్రీకాకుళం పెదపాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల ప్రిన్సిపాల్ యశోదలక్ష్మి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎవరైనా దరఖాస్తు చేయనివారు ఉంటే ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. విద్యార్థి ఆధార్ నంబర్, సెల్‌ఫోన్, పుట్టిన తేదీతో పాటు ఆన్‌లైన్‌లో ఏపీజీపీసెట్ అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

అనుమతుల్లేని టేకు పట్టివేత

మెళియాపుట్టి: మండలంలోని గోకర్ణపురం పంచాయతీ పరిధిలో గల చిన్నహంస గ్రామంలో అనుమతులు లేని టేకు కలపను అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. గ్రామానికి చెందిన వరిశ ఢిల్లీశ్వరరావు అనే వ్యక్తి అనుమతులు లేకుండా టేకు చెట్లను నరికి సుమారు 40 దుంగలను ఆయన ఇంటి ఆవరణలో వేయడంతో గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అధికారులు గ్రామానికి చేరుకుని కలపను పరిశీలించారు. జిరాయితీ భూమిలోని కలపను ఎలాంటి అనుమతులు లేకుండా నరికినట్లు నిర్ధారణ కావడంతో కేసు నమోదు చేసి కలపను స్వాధీనం చేసుకున్నారు.

రైల్వే గేటు వద్ద నిలిచిన బస్సు



దారికి అడ్డంగా ఆగిపోయిన బస్సు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో వాహనదారులతో అత్యంత రద్దీగా ఉండే కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వద్ద శనివారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సు నిలిచిపోయింది. పలాస ఆర్టీసీ డిపో నుంచి మెళియాపుట్టి వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సు రైల్వే ట్రాక్ దాటాక నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గేట్‌మెన్ అప్రమత్తం కావడంతో ప్రమాదం జరగలేదు. అనంతరం వన్‌వేలో వాహనాలను విడిచిపెట్టి బస్సుకు మరమ్మతులు చేశారు.



రేవులో రాముడి మనువు



దశరథుడు లేని లోటు కనిపించదు.. రాముడి పెళ్లికి ఆ ఊరంతా పెద్దలే. కన్యాదానానికి జనకుడే రానక్కర్లేదు.. సీతమ్మ అక్కడ ప్రతి ఇంటి దేవత. శివుడి విల్లు విరగ్గొట్టే విన్యాసం ఉండదు. జానకిరాముల జంట వారికి కన్నులపంట. రాముడి జననం నుంచి రావణ దహనం వరకు, త్రేతాయుగం నుంచి కలియుగం వరకు ఏ సందేహానికైనా సమాధానం నువ్వలరేవులోని శ్రీరామనవమి ఉత్సవం. ఇక్కడ సీతారాముల కల్యాణం చేస్తారు. రామాయణాన్ని నాటకాల రూపంలో ప్రదర్శిస్తారు. రావణ దహనాన్ని అందరి ముందు నిర్వహిస్తారు. అనాదిగా వస్తున్న ఆచారాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటూ ముందు తరాలకు అందిస్తున్నారు.

- సాగరతీరంలో సీతారాముల పరిణయ వేడుక
- శ్రీరామనవమి ఉత్సవాలకు నువ్వలరేవు సంసిద్ధం
- నేటి నుంచి ఏప్రిల్ 6 వరకు కన్నుల పండువగా ఉత్సవాలు

వజ్రపుకొత్తూరు రూరల్:

సాగరతీరం సీతారాముల కల్యాణానికి సిద్ధమవుతోంది. నువ్వలరేవు గ్రామంలో నేటి నుంచి శ్రీరామనవమి వేడుకలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో అతి పెద్ద మత్స్యకార గ్రామమైన నువ్వలరేవులో సామూహిక వివాహాలు అందరికీ తెలిసిన ప్రత్యేక వేడుక. కానీ ఇక్కడ జరిగే శ్రీరామనవమి వేడుకలు అంతకంటే ప్రాముఖ్యత సంతరించుకున్నాయి. ఈ గ్రామంలో సుమారు 3,300 ఇళ్లు ఉండగా దాదాపుగా 12 వేల మంది జనాభా ఉన్నారు. బెహరాల మాటే శిరోధార్యంగా భావించే ఈ పల్లెలో వారి మాట ప్రకారమే.. ఏటా శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. నేటి నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు ఉత్సవాలు జరిపేందుకు ఏర్పాట్లు చేశారు.



నువ్వలరేవు గ్రామ ముఖద్వారం

సండే స్పెషల్

ఉత్సవ ఉత్సాహం

తాము ఎక్కడ ఉన్న గ్రామ దేవత బృందావతి అమ్మవారి చల్లని దీవెనలు, సీతారాముల కరుణా కటాక్షాలు తమపై ఎల్లప్పుడూ ఉంటాయని గ్రామస్తుల విశ్వాసం. అందుకే సుమారు రూ.50 లక్షల వరకు వెచ్చించి సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు. తమ గ్రామంలో కన్నుల పండుగగా జరిగే సీతారాముల కల్యాణం చూసేందుకు వలస పక్షులంతా తిరిగి వస్తారు. శ్రీరామ నవమి ఉత్సవాలకు ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలతో ఊరంతా కొత్త వెలుగులు సంతరించుకుంటాయి.

కార్యక్రమాలివే..

ఆదివారం సాయంత్రం దాసుడి ఇంటి నుంచి దేవరతో బయలుదేరి ఠకురాణి అమ్మవారికి పూజలు చేసి జెండా ఆవిష్కరణతో ఉత్సవాలు ప్రారంభిస్తారు. మళ్లీ ఏప్రిల్ 6వ తేదీన రావణ సంహారంతో వేడుక లు ముగుస్తాయి. మొదటి రోజున అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేస్తూ నైవేద్యాలు సమర్పిస్తారు. 27వ తేదీన చిన్న పండగ నిర్వహించి పగటి వేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపడతారు. 28వ తేదీన పెద్ద పండగ నిర్వహిచి అమ్మవార్లకు చల్లదనం, మొక్కులు తీర్చుకుంటారు. తర్వాత వయస్సు భేదం లేకుండా ఆటపాటలు ఉంటాయి. శ్రీరామనవమి (30న) రోజున ముందుగా గ్రామ దేవత బృందావతి అమ్మవారి ఆలయం వద్ద జెండాను ఆవిష్కరించి ప్రత్యేక పూజలు చేస్తారు. అలాగే రామాలయం వద్ద మరో జెండాను ఆవిష్కరించి హోమం, యజ్ఞాలతో పండితులు వేదమంత్రోచ్ఛరణల మధ్య సీతారాములు కల్యాణం కన్నుల పండగగా జరుపుతారు. తర్వాత రోజు నుంచి 6వ తేదీ వరకు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. కర్రసాము, గారడీ, పాండురంగ, రామ నాటకం, రామయ్య పట్టాభిషేకం, మండపారాధన, కోయి డాన్స్, రావణ దహనం వంటివి నిర్వహిస్తారు.



వేడుకలకు సిద్ధమైన రామాలయం

ఐకమత్యంగా నవమి ఉత్సవాలు



తరతరాలుగా వస్తున్న శ్రీరామనవమి ఉత్సవాలు ఐకమత్యంతో జరుపుకుంటున్నాం. మా ఇంటి ఇలవేల్పుగా బృందావతి అమ్మవారిని కొలుచుకుంటూ మాకు ఆదర్శ దైవంగా నిలిచిన శ్రీరాముడు, సీతమ్మలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఏటా వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నాం.

– ముమ్మల ఎర్రా, ఉత్సవ కమిటీ సభ్యులు, నువ్వలరేవు, వజ్రపుకొత్తూరు మండలం.

ఆచారాలకు పెద్ద పీట



తరతరాలుగా వస్తున్న ఆచార వ్యవహారాలకు పెద్ద పీట వేస్తాం. వలస కూలీలు ఎక్కడ ఉన్నా స్వగ్రామానికి చేరుకుంటారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామ పెద్దలు, పూజారులు, యువకుల సహకారంతో ఉత్సవాలు నిర్వహిస్తాం.

– నీలాంబర్, సొసైటీ అధ్యక్షుడు, నువ్వలరేవు, వజ్రపుకొత్తూరు మండలం.

గర్వంగా ఉంది



భద్రాద్రి రామయ్యకు మా గ్రామంలో వైభవంగా కల్యాణ మహోత్సవం ఏటా చేస్తుంటాం. ఎన్నో ప్రత్యేకతలకు నిలయంగా ఉన్న నువ్వలరేవులో పుట్టడం నిజంగా గర్వంగా ఉంది. ఆచార వ్యవహారాలను, సంప్రదాయాలను గౌరవిస్తూ చిన్నా పెద్ద అని తేడా లేకుండా అందరి సహకారంతో ఉత్సవాలు జరుపుకుంటాం.

– ముమ్మల దేవ, ఉత్సవ కమిటీ సభ్యులు, నువ్వలరేవు, వజ్రపుకొత్తూరు మండలం

ప్రత్యేక అలంకరణలో వెంకన్న



శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం చిన్నబజారులో కొలువై ఉన్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు శ్రీనివాసాచార్యులు స్వామిని తులసి, పూలమాలతో అందంగా అలంకరించారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

మేలుజాతి దూడల ప్రదర్శన



వినూత్నంగా ఏర్పాటు చేసిన ప్రదర్శన

జి.సిగడాం: గ్రామాల్లో మేలుజాతికి చెందిన ఆవులను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. దీనిలో భాగంగా నడిమివలస గ్రామంలో శనివారం మేలుజాతికి చెందిన లేగ దూడలన్నీ ఒకే దగ్గర ఏర్పాటు చేసి మెరుగైన, ఆరోగ్యకరమైన దూడలు పెంచిన రైతులకు సంబంధిత పశువైద్య అధికారులు బహుమతులను అందించారు. ప్రదర్శించిన లేగదూడలను చూసేందుకు ప్రజలు, రైతులు అధికసంఖ్యలో వచ్చారు.

నేడు రెవెన్యూ సర్వీసుల సంఘం ఎన్నిక

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా రెవెన్యూ సర్వీసుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు ఆది వారం రెవెన్యూ వసతి గృహంలో జరగనున్నట్టు ప్రస్తుత జిలా కార్యదర్శి బీవీవీఎస్ రాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికల్లో మూడు రెవెన్యూ డివిజన్ల యూనిట్లు, కలెక్టరేట్ యూనిట్లతో పాటు ఓటు ఉన్న వారు హాజరుకావాలని తెలిపారు. ఈ ఎన్నికల ప్రక్రియం ఉదయం 10 నుంచి ప్రారంభమై సాయంత్రానికి ముగుస్తుందన్నారు.

సమస్యలపై సమీక్ష

- జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో పలు సమస్యల ప్రస్తావన
- అధికారులకు దిశానిర్దేశం చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

అరసవల్లి:

జిల్లాలో రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అధికారులను ఆదేశించారు. జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం జరిగిన స్థాయీ సంఘ సమావేశాలకు ఆమె అధ్యక్షత వహించి పలు కీలక సూచనలు చేశారు. మండల పరిషత్‌లకు బోర్ల మరమ్మతు పరికరాలు సకాలంలో అందడం లేదని, దీంతో ఎక్కడా క్రాష్ ప్రోగ్రాం కింద బోర్లు మరమ్మతులు జరగడం లేదన్నారు. ఈ సమస్యపై తక్షణ చర్యలు చేపట్టాలని జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ శ్రీనివాసప్రసాద్‌లను ఆదేశించారు. అలాగే ఉద్దానంలో కూడా మంచినీటి ప్రాజెక్టు పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, అయితే ఎక్కడా ఇబ్బందులు రాకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ శ్రీనివాసప్రసాద్‌కు సూచించారు. దీనిపై ఎస్‌ఈ మాట్లాడుతూ ఉద్దానం మంచినీటి ప్రాజెక్టును వచ్చే జూన్‌నాటికి పూర్తి చేసి ప్రారంభించే అవకాశాలు ఉన్నాయన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలు తదితర భవనాలతో పాటు ఇంకొన్ని పనుల బిల్లులకు ఏప్రిల్ మొదటి వారంలోనే చెల్లింపులు జరుగుతాయని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ ప్రకటించారు. గత ఏడాది ఆగస్టు వరకు అప్‌లోడ్ చేసిన పనులకు చెందిన బిల్లులన్నీ కాంట్రాక్టర్ల ఖాతాలకు జమ చేశామని, డ్వామా పీడీ చిట్టిరాజు చెప్పిన సమాచారం మేరకు ఇప్పటివరకు రూ.45 కోట్లు వరకు పెండింగ్ బిల్లులకు చెందినవి అప్‌లోడ్ అయ్యాయని, ఈ నెలాఖరు కల్లా అప్‌లోడ్ అయిన బిల్లులను కూడా కలుపుకుని ఏప్రిల్ మొదటివారంలోనే చెల్లింపులు జరుగుతాయని ప్రకటించారు. అలాగే ఇటీవలే నాడు–నేడు పనులకు చెందిన రూ.37.88 కోట్లు, నాడు–నేడు కింద ప్రభుత్వ జూనియర్ కాలేజీ అభివృద్ధి పనులకు రూ.33 కోట్లు వరకు పెండింగ్ బిల్లులన్నీ అకౌంట్స్‌లో వేశారని గుర్తుచేశారు. జెడ్పీటీసీలు సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని ఆమె హామీ ఇచ్చారు. దీనిపై రణస్థలం, సరుబుజ్జిలి, ఆమదాలవలస, సంతబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యులు సీతారాముడు, నాగేశ్వరరావు, గోవిందరావు, వసంత రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు సమావేశాలు సాగాయి. 6వ స్థాయీ సంఘ సమావేశానికి వైస్ చైర్‌పర్సన్ సిరిపురపు జగన్మోహనరావు, 3వ స్థాయీ సంఘ సమావేశానికి వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణిలు అధ్యక్షత వహించారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

అతివలకు అండ

- మూడో విడత వైఎస్సార్ ఆసరా కింద జిల్లాలో రూ.310.21 కోట్లు జమ
- 4.54 లక్షల మంది పొదుపు సంఘాల అక్క చెల్లెమ్మలకు బాసట

శ్రీకాకుళం పాతబస్టాండ్:

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళలకు అండగా నిలుస్తోందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత నిధుల పంపిణీ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏలూరు జిల్లా ఇందులూరులో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిర్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి ధర్మాన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాదయాత్రలో డ్వాక్రా మహిళల కష్టాలు చూసిన వైఎస్ జగన్ అప్పుడు ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నారని గుర్తు చేశారు. గత ప్రభుత్వాలకు, ఈ ప్రభుత్వానికి గల తేడాలను గమనించాలని, ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలంటే మీ అందరి దీవెనలు ప్రభుత్వానికి అవసరమని మహిళలను కోరారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత కింద 4.54 లక్షల మంది పొదుపు సంఘాల్లోని అక్క చెల్లెమ్మలకు రూ.310.21 కోట్ల నమూనా చెక్కును మహిళలకు అందజేశారు. శ్రీకాకుళం నియోజక వర్గంలో 12 చోట్ల సభలు ఏర్పాటుచేసి ఈ నిధులను పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేసినట్లు తెలిపారు. తొలుత అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవం సందర్భంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చిరుధాన్యాల మహోత్సవ ప్రదర్శన స్టాళ్లను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం మహిళా పక్షపాతి అని కొనియాడారు. ఓట్లను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం కార్యక్రమాలను అమలు చేయడం లేదని, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబుల పంపిణీ, నాడు–నేడుతో విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చిన సంగతిని ఆమె ఉటంకించారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ పథకం ప్రవేశపెట్టినా ఆ పథకం మహిళలకే చెందేలా అమలుచేయడం జరిగిందని తెలిపారు. నగదు పంపిణీలో రాష్ట్రస్థాయిలో మన జిల్లా మూడో స్థానంలో ఉందని, మహిళా సభ్యుల పరంగా చూస్తే జిల్లా ప్రథమస్థానంలో నిలవడం గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ వైశ్య, తూర్పు కాపు, పొందర, కాపు కార్పొరేషన్ల చైర్మన్లు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, రాజాపు హైమావతి, పేరాడ తిలక్, రాష్ట్ర మహిళా ఆర్థిక సంస్థ చైర్ పర్సన్ బి.హేమమాలిని రెడ్డి, డీసీఎంఎస్ చైర్ పర్సన్ చల్లా సుగుణ, మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, జిల్లా, పట్టణ మహిళా సమైక్య అధ్యక్షురాలు మూల కృష్ణవేణి, సుగుణారెడ్డి పాల్గొన్నారు.



లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

మహిళల పాలిట దైవం వైఎస్ జగన్

పాదయాత్ర సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి డ్వాక్రా రుణాన్ని నాలుగు వాయిదాల్లో చెల్లిస్తున్న సీఎం వైఎస్ జగన్ మహిళల పాలిట దైవమని గార మండలం పూసలపాడు గ్రామానికి చెందిన పొదుపు సంఘం మహిళా సభ్యురాలు కె.రాజేశ్వరమ్మ మంత్రి ధర్మాన ప్రసాదరావుతో తన మనోగతం పంచుకున్నారు. ఈ ప్రభుత్వం వచ్చే నాటికి తనకు రూ.4.50లక్షలు రుణం ఉండేదని అన్నారు. ఆసరా కింద ఇప్పటివరకు తమ సంఘంలోని ఒక్కొక్కరికి రూ.56వేలు అందాయని, వీటితో పాటు చేయూత కింద రెండు విడతల్లో రూ.37,500లు అందాయన్నారు. ఆసరా డబ్బులతో గొర్రెల పెంపకం చేపట్టానని, అలాగే రెండు విడతల చేయూత కింద 4 మేకలు కొనుగోలు చేసి వ్యాపారం చేస్తున్నానని చెప్పారు. తన మనవళ్లకు అమ్మ ఒడి, తనకు పింఛన్ అందుతోందని ఆనందం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో దర్శకుడు జయశంకర్



స్వామి సన్నిధిలో జయశంకర్ కుటుంబ సభ్యులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని 'పేపర్‌బాయ్' సినిమా దర్శకుడు వి.జయశంకర్ కుటుంబసమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జయశంకర్ మాట్లాడుతూ తొలిసినిమా 'పేపర్‌బాయ్' అన్ని వర్గాలను అలరించిందన్నారు. ప్రస్తుతం వి.జె.సన్నీతో 'సాండ్‌పార్టీ' అనే యూత్‌ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నట్లు తెలిపారు. అగ్ర కథానాయిక కాజల్ అగర్వాల్‌తో సస్పెన్స్ థ్రిల్లర్ తీస్తానని చెప్పారు. అరసవల్లి ఆదిత్యున్ని తొలిసారిగా దర్శించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చైతన్య సుధా వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ డాక్టర్ జి.సుమతి, పాతపట్నం ఎస్‌టీఓ ఎం.భాగ్యలక్ష్మి, సిబ్బంది ప్రసాద్ పాల్గొన్నారు.

గిరిజన భూములకు సాగుహక్కు కల్పించాలి



నందవతోవూరులో భూములను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మెళియాపుట్టి: మండలంలోని పరశురాంపురం పంచాయతీ నందవతోవూరు, పెద్దమడి గ్రామాల్లో సుమారు 35 మంది గిరిజన కుటుంబాలకు చెందిన భూములను కొందరు గిరిజనేతరులు తప్పుడు పత్రాలు సృష్టించి స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నించడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.సూరయ్య అన్నారు. శనివారం ఆయా గ్రామాల్లో పర్యటించి గిరిజనుల భూములను పరిశీలించారు. గిరిజనులు తరతరాలుగా సాగు చేసుకుంటున్న పోడుభూములను ఆక్రమించుకోవాలని చూస్తే జిల్లాస్థాయిలో పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. వెంటనే గిరిజన భూములకు సాగు హక్కు కల్పించాలని కోరారు. ఇదే విషయమై ఏప్రిల్ 3న స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేయనున్నట్లు ప్రకటించారు. వారితోపాటు పలువురు గిరిజనులు ఉన్నారు.


ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.అనూరాధ

గార: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ఎయిడ్స్, టీబీ, కుష్టు వంటి రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు వహించాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎన్.అనూరాధ అన్నారు. శనివారం అంపోలు జిల్లా జైలులో ఎయిడ్స్ నివారణ సంస్థ, సాతి స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఖైదీలకు సుఖవ్యాధులు, టీబీ రక్తపరీక్షలు నిర్వహించారు. అనంతరం వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ నబీఖాన్, జైలర్లు దివాకర్, శంకరరెడ్డి, చిరంజీవి, ఎస్.మేనక తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



పాతపట్నంలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

పాతపట్నం: ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతమైన పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద శనివారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఐ ఎస్.కామేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఒడిశా నుంచి వస్తున్న ప్రతి వాహనాన్ని ఆపి పత్రాలు పరిశీలించారు. తనిఖీల్లో ఏఎస్‌ఐ సింహాచలం, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150–00
బంగారం(22సి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215



జొన్న చేగొడియాలు, జంతికలు, సేవ్



కొర్ర అరిసెలు



కొర్ర పొంగడాలు



నల్ల బియ్యం ఉండలు



అవిశ గింజలు



రాగులు

చిరుధాన్యాలకు.. ప్రాధాన్యం

2023ను చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. చిరు ధాన్యాలు, వాటితో తయారు చేసిన ఆహార ఉత్పత్తులను ప్రదర్శించారు. ఆసరా కార్యక్రమానికి విచ్చేసిన వారికి చిరుధాన్యాల ఆవశ్యకతను అధికారులు వివరించారు. వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ, అంగన్‌వాడీ, డీఆర్‌డీఏ, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఉన్నతాధికారులు తిలకించారు.

-శ్రీకాకుళం పాతబస్టాండ్/సాక్షి ఫొటోగ్రాఫర్ శ్రీకాకుళం




చిరు ధాన్యాల స్టాల్స్‌ను సందర్శిస్తున్న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు



రాగి అప్పడాలు



చిరు ధాన్యాలను కొనుగోలు చేస్తున్న మహిళలు



జొన్నలు



అరికెలు



సామలు



అంటు కొర్రలు



గంటెలు



కొర్రలు

కళలను ఆదరించాలి



కమనీయం నాటికలో ఓ సన్నివేశం



అభినయ నృత్య నికేతన్ నృత్య ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్ : కళలను ప్రతిఒక్కరూ ఆదరించాలని, నాటక కళను బతికించేందుకు సుమిత్రా కళాసమితి చేస్తున్న కృషి ప్రశంసనీయమని వక్తలు పేర్కొన్నారు. అరసవల్లిలో కొత్తగా ఏర్పాటు చేసిన వైజయంతి వేదికపై ప్రపంచ రంగస్థల దినోత్సవం పురస్కరించుకుని నాటిక పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి.

సూర్యనారాయణ స్వామి దేవస్థానం, సుమిత్రా కళాసమితి సంయుక్త ఆధ్వర్యంలో ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ పోటీలను మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముందుగా అభినయ నృత్యకేతన్ చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు కొంచాడ సోమేశ్వరరావు, దేవదాయశాఖ సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, సుమిత్రా కళాసమితి అధ్యక్ష, కార్యదర్శులు ఇప్పిలి శంకర శర్మ, గుత్తు చిన్నారావు, లోకనాథం రామలింగేశ్వరరావు, నందికేశ్వరరావు, నక్క శంకరరావు, మండవిల్లి రవి, కిల్లా ఫల్గుణరావు, తిమ్మరాజు నిరజ, వివిఆర్ మూర్తి, కె.సురేష్, యు.పూజ, రాజు, ప్రధాన విజయరామ్, మొట్ట పోలినాయుడు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటికలు

గుంటూరు, సద్గురు కళానిలయం ఆధ్వర్యంలో ప్రదర్శించిన కమనీయం నాటిక ఆద్యంతం అలరించింది. విద్యాధర్ మునిపల్లి రచించగా, బసవరాజు దర్శకత్వం వహించారు. అక్కా చెల్లెళ్లు తమ కాపురాలను చక్కబెట్టుకునే సన్నివేశాలతో సాగిన 'అక్క అలుగుడు–చెల్లి సణుగుడు' నాటిక సైతం ఆకట్టుకుంది. అద్దేపల్లి భరత్‌కుమార్ రచించగా, షేక్ షఫీ దర్శకత్వం వహించారు.

వైఎస్సార్ సీపీలో యాదవులకు
సముచిత గౌరవం



ఎమ్మెల్సీ నర్తు రామారావును సత్కరిస్తున్న జిల్లా యాదవ సంఘ నాయకులు

కాశీబుగ్గ: జిల్లాలో యాదవులను గౌరవించి ఎమ్మెల్సీ పదవి ఇచ్చిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీయేనని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే తామంతా నడుస్తామని అఖిల భారతీయ యాదవ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు రాపాక చిన్నారావు యాదవ్ అన్నారు. శనివారం ఎమ్మెల్సీ నర్తు రామారావును జిల్లా యాదవ కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర పార్టీలు యాదవులను ఓటర్లుగా మాత్రమే గుర్తించారు తప్ప నాయకత్వం ఇవ్వలేదన్నారు. ఇప్పుడు యాదవుల సమస్యలు పరిష్కరించడానికి చక్కని అవకాశం వచ్చిందన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి కొర్రాయి వాసు యాదవ్, పలాస నియోజకవర్గ అధ్యక్షుడు మద్దిల హరినారాయణ యాదవ్, అఖిల భారతీయ యాదవ మహాసభ అండమాన్ యాదవ సంఘ గౌరవ అధ్యక్షుడు పాలిన రామారావు యాదవ్, జినగ సీతారాం యాదవ్, తలగాన శంకర్‌యాదవ్, డొక్కర దిలీప్‌కుమార్, దాసరి దానేష్ యాదవ్, పాలిన కృష్ణారావు యాదవ్, కొల్లి రమేష్, పలాస మండల కార్యదర్శి సార ఢిల్లేశ్వరరావు యాదవ్, జినగశ్యామ్ యాదవ్, కాళ్ల తిరమల యాదవ్, దాసరి నేతాజీయాదవ్, డొక్కర అజయ్‌కుమార్ యాదవ్, కాయ సాయి పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర కవితల పోటీలకు ఆహ్వానం

శ్రీకాకుళం కల్చరల్: కవితా నిలయం, తపస్వి మనోహరం సంయుక్త నిర్వహణలో ఉత్తరాంధ్ర వచన, పద్య కవితల పోటీల నిమిత్తం కవుల నుంచి కవితలను ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు మహ్మద్ రఫీ(ఈవేమన), జంధ్యాల శరత్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగుదనం, సామాజిక బాధ్యతకు సంబంధించి ఒక్కొక్కరు 20 వరుసలకు మించని వచన కవిత, 5 పద్యకవితలను మే5లోగా పంపించాలని కోరారు. విజేతలకు నగదు బహుమతులు అందిస్తామన్నారు. కవితలను మహ్మద్ రఫీ(ఈవేమన) ఎస్.1, శారదా అపార్ట్‌మెంట్, లక్ష్మీనగర్, రణస్థలం–532407 చిరునామాకు గానీ, 9059690733 వాట్సాప్ నంబరుకు గానీ పంపించాలని కోరారు.

నేడు తూర్పుకాపు సంక్షేమ సంఘ ఆత్మీయ సమావేశం

శ్రీకాకుళం: శ్రీకాకుళంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో ఈ నెల 26న ఉదయం 10 గంటలకు తూర్పు కాపు సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్, సురంగి మోహనరావు, ఎస్‌కే నాయుడు తెలిపారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో అత్యధిక జనాభా కలిగిన తూర్పు కాపు కులస్తులు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేయనున్న ఆత్మీయ సమావేశానికి సంఘ సభ్యులంతా సలహాలు, సూచనలు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కరిమజ్జి మల్లేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, కె.శ్యామ్ సుందరరావు, ఎల్.వి.రాజశేఖర్, ఎం.రామజోగినాయుడు, కిలారి నారాయణరావు, పడాల తమ్మినాయుడు, అంకడాల తవిటన్న పాల్గొన్నారు.

కృత్రిమ గర్భధారణతో లక్షన్నర లేగదూడలు ఉత్పత్తి

జి.సిగడాం: ఉమ్మడి జిల్లాలో కృత్రిమ గర్భధారణ ద్వారా లక్షా 79 వేల మేలుజాతి లేగదూడలు ఉత్పత్తి చేసినట్లు జిల్లా పశుసంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ శివ్వాల మన్మధరావు వెల్లడించారు. శనివారం జి.సిగడాం మండలం నడిమివలసలో మేలుజాతి లేగదూడల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి ఒక సచివాలయం వద్ద మేలుజాతి లేగదూడల ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 4,97,734 పశువులకుగాను ఇప్పటి వరకు 3,26,056 పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేశామని వివరించారు.

చిన్నారిని ఆదుకోరూ..!

- 'న్యూరో బ్లాస్టోమా' క్యాన్సర్‌తో పోరాడుతున్న ఐదేళ్ల యోగేంద్ర
- దాతల సాయం కోసం ఎదురుచూపు



క్యాన్సర్‌తో బాధపడుతున్న లండ యోగేంద్ర(ఫైల్)

కంచిలి: ఆడుకోవాల్సిన వయసులో ఆ చిన్నారికి పెద్దకష్టం వచ్చిపడింది. ఐదేళ్ల ప్రాయంలోనే క్యాన్సర్ వ్యాధి సోకి తీవ్ర అనారోగ్యానికి గురిచేస్తోంది. సుమారు రూ.25 లక్షల వరకు చికిత్సకు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో పేద తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నారు. కంచిలి మండలం పెద్దశ్రీరాంపురం గ్రామానికి చెందిన లండ భూషయ్య, కేతిక దంపతుల ఐదేళ్ల కుమారుడు లండ యోగేంద్రకు న్యూరో బ్లాస్టోమా అనే క్యాన్సర్ వ్యాధి సోకింది. ప్రస్తుతం నాలుగో స్టేజ్‌లో ఉంది. ప్రస్తుతం విశాఖపట్నంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద కీమోథెరపీ జరుగుతోంది. దీని తర్వాత శస్త్రచికిత్స కోసం సుమారు రూ.25లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు పేర్కొన్నారు. చిన్నారి తండ్రి భూషయ్య సోంపేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. పెద్ద మొత్తంలో శస్త్రచికిత్స కోసం అవసరం కావడంతో ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారు. దాతలే తమ బిడ్డను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. చిన్నారికి సాయం చేయదల్చినవారు భూషయ్య స్నేహితుడు తెలుకుల బృందావనం(కాంటాక్ట్ నంబర్: 93813 78837, ఫోన్‌పే నంబర్:9603992643) సంప్రదించవచ్చు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



ఘటనా స్థలంలో అప్పారావు మృతదేహం

కంచిలి: మండలంలోని మకరాంపురం కూడలి వద్ద శనివారం 'ఆదివారం సంత' ప్రాంగణం ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో అంపురం గ్రామానికి చెందిన మల్లార్పు అప్పారావు(58) దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళితే.. అప్పారావు, మరో ఐదుగురు కలిసి సంత వద్ద సరుకులు అన్‌లోడ్ చేయడానికి వెళుతుండగా ఇచ్ఛాపురం నుంచి పలాస వైపు వెళ్తున్న మహేంద్రా బొలెరో వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో అప్పారావు అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతనికి భార్య తిరుపతమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్‌ఐ ఎస్.చిరంజీవి డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. వాహనాన్ని సీజ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బకాయిల చెల్లింపు ఉత్తర్వులపై హర్షం



డీఈఓ పగడాలమ్మకు వినతిపత్రం అందజేస్తున్న భాషోపాధ్యాయ సంస్థ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: డీఎస్సీ–2002 ద్వారా ఎంపికై 2019లో నియామకాలు పొందిన 42 మంది హిందీ భాషాపండితులకు 45 నెలల బకాయి జీతాల చెల్లింపునకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయడాన్ని స్వాగతిస్తున్నామని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లాశాఖ అధ్యక్షుడు పిసిని వసంతరావు, ప్రధాన కార్యదర్శి కూన రంగనాయకులు, సహాధ్యక్షుడు కుప్పన్నగారి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు తక్షణమే చెల్లింపు ప్రక్రియ ప్రారంభించాలని కోరుతూ జిల్లా విద్యాశాఖాధికారి గార పగడాలమ్మను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న జీతాల సమస్యకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో పరిష్కారం లభించిందన్నారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు: ఆర్‌యూపీపీఏ

బాధిత భాషాపండితులకు ఎట్టకేలకు మేలు జరగడం పట్ల రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీఏ) జిల్లాశాఖ ప్రతినిధులు హర్షం వ్యక్తంచేశారు.

ఈ మేరకు శనివారం వారు డీఈఓను కలిసి వినతిపత్రం అందజేశారు. కమిషనర్ జీతాల చెల్లింపునకు మెమో జారీ చేయడం సంతోషదాయకమని చెబుతు.. సంబంధిత డ్రాయింగ్ అధికారుల ద్వారా భాషా పండితుల ట్రెజరీ ఐడీ నంబర్లు కోసం ప్రతిపాదనలు పంపించేలా తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈఓను కలిసినవారిలో ఆర్‌యూపీపీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండేపల్లి మల్లేసు, రాష్ట్ర మహిళా కార్యదర్శి కె.పద్మావతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జి.వీరస్వామి, జి.సూర్యారావు, ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.